ఎర్ర బుష్‌కోటు

శ్రీరంగం నారాయణబాబు

గరివిడి మాంగనీసు గనుల్లో మా బావమరది మేనేజరుగా పని చేస్తున్నాడు. సాధారణంగా బంధువుల ఇళ్ళకంటూ వెళ్ళను, నేను ఎప్పుడూ. కాని, మా చెల్లెలంటే నాకు మమకారం ఎక్కువ. అది పుట్టాక మా అమ్మ జబ్బుమనిషై పోయింది నా చేతులతో నేను పెంచాను. అందుకే మా చెల్లెలంటే నాకు వల్లమాలినఅభిమానం.

వేసవికాలంలో మా ఊళ్ళో ఎండలు దారుణంగా వుంటవి. మా వూరికి అప్పటికింకా ఎలక్ట్రిసిటీ రాలేదు. పంకాలుగాని, దీపాలుగాని, సౌకర్యం కొంచెం కూడా లేదు. వేసవికి రమ్మనమని మా బావమరిది ఉత్తరం రాశాడు. కాస్త ఎత్తయిన జాగా—కొండ మీదవడంచేత, అక్కడ ఎలక్ట్రిసిటీ ఉండడంనుంచీ, మా బావమరిది పెద్ద ఉద్యోగస్తుల్లో లెక్క వస్తాడు కాబట్టి, చిన్న బంగళాలో వుంటున్నాడు. అక్కడ హాయిగా వుంటుందనీ, అంతేకాకుండా గనుల కన్నిటికీ యజమాని—డైరక్టర్ సింగ్—ఇంగ్లండు వెళ్ళి వచ్చినవాడనీ, ఆయన దగ్గర ఎన్నో మంచి పుస్తకాలూ, చక్కని లైబ్రరీ వుంది, చదువుకోవచ్చును. రమ్మనమనీ రాశాడు. బ్రతుకు జీవుడా అని పాముకాటులాంటి వేసవికాలాన్ని తప్పించుకుందుకుగాను, మనకు నల్లమందులాంటి మంచి పుస్తకాలు కూడా అక్కడ లభ్యమవుతాయని, మూటా ముల్లే కట్టుకుని, బస్సుమీద గరివిడి చేరుకున్నాను.

ఆరోజు సాయంకాలమే మా బావమరిది సింగ్ దగ్గరకు తీసుకెళ్తాను రమ్మనమన్నాడు.

సింగ్ పంజాబీ మనిషి ఆజానుబాహు. మంచి వర్చస్సు వున్నవాడు ఇంగ్లండు వెళ్ళివచ్చాడు. ఆ రోజుల్లో ఇంగ్లండు వెళ్ళడమంటే కాశీ వెళ్ళడం కంటే గొప్ప మాట సింగ్ ఇంగ్లండ్ వెళ్ళినా, ఏ పరీక్షలూ పాస్ అవలేదు. ఇంగ్లండ్ వెళ్ళినందుకు ఆయనకు అలవాటైనవి రెండు గుణాలు తాగి తందనాలాడడం—అవకాశంవస్తే వ్యభిచరించడం ఈ రెండు గుణాలూ ఇంగ్లండులో సంపాదించాడు కాబట్టి, ఎంతటి గొప్ప ఉద్యోగానికైనా అర్హుడు. అంచేత ఆ మాంగనీస్ కంపెనీకి డైరక్టరుగా వెయ్యి రూపాయల జీతం, కారూ, బంగళా అన్నీ సమకూరినై.

సింగ్ ఎప్పుడూ ఆఫీసుకు వెళ్ళట్ట. ఇంట్లోనే కూర్చుంటాడు, తాగుతూ. సంతకాలు పెట్టవలసిన కాగితాలన్నీ, సాయంత్రం ఐదు గంటలకి మా బావమరిది తీసుకెళ్ళి సంతకాలు పెట్టించాలి.

అడివి జంతువుకన్నా అధ్వాన్నం. కనుపించదు. మాటలు రావు. చేతలకు హద్దుల్లేవు. ఇదీ కొడుకుస్థితి. సంఘంలో వెలికి, తనవారితో తెగతెంపులకు వెరవక, ప్రేమించి పెళ్ళిచేసుకొంటే భర్త అకాలమృత్యువు వాతపడ్డాడు. దిక్కులేదు. అయినా కొడుకును విడిచిపెట్టలేకపోయింది రంగమ్మ.

ఇంక ఆ అధికారి రాత్రి అంతా త్రాగడంలో గడుపుతాడు. ప్రొద్దెక్కి లేచి, పడక గదిలోంచి బయటపడి, హాలులో కూర్చుంటాడు. ఆ సమయంలో ఎవరైనా కనుపించినా, ఏమైనా చప్పుడుచేసినా సహించడు. ఎంతపనైనా చేస్తాడు.

ఆ అధికారి కొడుకు పుట్టినరోజు పండుగనాడు తొడుగుకొన్న ఎర్రబుష్‌కోటు చూచి రంగమ్మ భయపడిందంటే ఆశ్చర్యం ఏముంది?

ఎర్రబుష్‌కోటు

ఐదు మొదలుకొని ఆరువరకే ఈ లోకానికి చెందిన వ్యవహారాలూ, ఈ లోకంలో వుండడం. మళ్ళా ఆరు గంటలు కొట్టారంటే, పీత్వా పీత్వా పునఃపీత్వా అని ఎన్ని గాజుబుడ్లు గొంతులోకి దిగుతాయో చెప్పడం కష్టసాధ్యం.

సింగ్‌కు ఒక భార్యా, ఇద్దరు పిల్లలూ వున్నారు. భార్య ముఖం చూస్తే పూర్వోత్తరపు మనిషి, సాధ్వి అనిపించింది. ఒక కొడుకూ, కూతురూ ఆయనకి కొడుక్కి నాలుగేళ్ళూ, కూతురికి ఐదేళ్ళు. ఇద్దరు పిల్లలూ అందంగా, దొరల పిల్లల్లా వుంటారు.

సాయంత్రం మా బావమరిది ఆఫీసు కాగితాలతోపాటు నన్ను కూడా తీసుకెళ్ళి సింగ్‌కు గొప్పగా పరిచయం చేశాడు—కవిననీ, విద్వాంసుణ్ణనీ. సింగ్ కూర్చున్న హాలులో అనేక పులిచర్మాలూ, తుపాకీలూ అవీ వున్నయి. సింగ్ ఒకప్పుడు గొప్ప వేటగాడట. ఇప్పటికీ కూడా పట్నంనుంచి విదేశీ సారా రావడం ఆలస్యమైతే—లేదా, సారాకు గ్రహణం పట్టిన రోజుల్లో, వేటకని వెళ్ళిపోతాడు కారు వేసుకొని. సారా బుడ్లు వచ్చాయని తెలిస్తేనే సందెవేళకో, అపరాత్రికో ఇల్లు చేరుకుంటాడు.

సింగు నాతో ముక్తసరిగా రెండు మాట్లాడి ఇక్కడకు అన్ని పుస్తకాలూ తేలేదు, కొన్ని పుస్తకాలే తెచ్చానని, ఆవున్న పుస్తకాలు కావలిస్తే చూడొచ్చని, చూపించమని భార్యకు ఆదేశించాడు. ఆవిడ సవినయంగా నమస్కరించి, పక్కగదిలోకి తీసుకెళ్ళింది. ఒకటి రెండు పెద్ద వరుస బీరువాల్లో నాకు కావలసిన పుస్తకాలన్నీ ఉన్నాయి. కొన్ని ఏరుకొని, అవి చదివి ఇచ్చేశాక, కొత్తవి పట్టుకెళ్తానని మళ్ళీ అని సింగ్‌కు ధన్యవాదాలర్పించి, ఇంటి ముఖం పట్టేవేళకి, సింగ్ పిలిచి 'నాతో మీకిక పని లేదు మీకు కావలసినప్పుడు వచ్చి, నా భార్య నడిగి పుస్తకాలు పట్టుకెళ్తుండం'డని నాతో గౌరవంగా చెప్పాడు. నేను బ్రతుకుజీవుడా అనుకున్నాను. ఆయన తాగుడికి ఆటంకం రాకుండా వుండేందుకు అనుకుంటాను అలా అన్నాడు.

త్రాగినవాడితో ఎలా మాట్లాడడమో, ఎంత తెలివైనవాడైనా, త్రాగినవాడైతే తెలియదు. వెర్రివాణ్ణి వెర్రివాడే తెలుసుకున్నట్లుగా తాగేవాడే అర్థం చేసుకోగలడు.

మా బావమరిది ఆఫీసుపక్క, నేను ఇంటి పక్కా తిరిగి నడుస్తున్నాము. సింగ్ బంగళాకు ఎదురుగుండా చింతచెట్టుకింద చిన్న పూరిగుడిసెముందు, యౌవనం సడలి, ప్రౌఢత్వం పరిఢవిల్లే ఒక అందాలు చిందే ఆడమనిషి మాసిన చీరతో ఒక నాలుగేళ్ళ కుర్రాణ్ణి దగ్గర పెట్టుకొని కూర్చుంది. ఆవిడ ముఖం చూస్తే నా కెందుకో ఆవిడ పెద్దింటికి చెందింది, కర్మవశాత్తూ, కాల వైపరీత్యం వలన, కడగళ్ళకుపాలై, ఈ దీనావస్థలో వుంది—ఒక ఉపశమించే మాటంటే ఆవిడకు ఓరడి చేకూరుతుందేమో అనిపించింది.

దగ్గరవున్న కుర్రవాడు నాలుగేళ్ళవాడు. ఆ కుర్రవాడికి మానవత్వం పోలికలులేవు. మృగంలా వున్నాడు. కాస్త చిన్నపిల్లలు చూస్తే దడుచుకుంటారు. ఆవిడ కొడుకు అవుతాడా? ఎంతమాత్రంకాడు. భర్త ఒకవేళ ఎంత అందవిహీనుడైనా ఆవిడ వర్చస్విని కాబట్టి, కొంతైనా పోలికి రాకుండా వుంటుందా! ఏమో, ఏమని చెబుతాం. భార్యాభర్తలు అందంగా వుండొచ్చు — పిల్లలు వికృతంగా వుండొచ్చు! దంపతులు ఏమీ అందమైనవాళ్ళుకాకపోవచ్చును—పిల్లలు అందమైనవారు అవవచ్చును. చీకటిలోంచి కాంతి పుట్టలేదా, కాంతిని చీకటి కబళించలేదా—అంతే!

పలకరిస్తే ఏమనుకుంటుందో—పెద్దవాణ్ణి అనుకుంటుందేమో! అనుకుంటూ నాలుగడుగులు వెళ్ళి మనస్సు వెనక్కి లాగితే ఆ పూరిగుడిసె దగ్గరకే వెళ్ళా. ఆమె భయంగా లేచి ఆ గుడిసెలోకి వెళ్ళింది. పైకి ముఖాన్నిపెట్టి "ఎవరు బాబూ, మీకు ఏం కావాలి?" అంది. నీ పేరేమిటన్నా. ఆవిడ పేరు చెప్పేందుకు జంకింది. నేను నా మనస్సులో అనుకున్నది చెప్పా.

"నా పేరు రంగమ్మ. మీరు అనుకున్నదానిలో యథార్థం వుందండి. మీరు గొప్ప ఇంటివారు కాబట్టి పోల్చగలిగారు. మరోపుడు నా బ్రతుకు మీకు మనవి చేసుకుంటాను. చీకటి పడుతున్నాది. ఎవరైనాచూస్తే ఏమైనా అనుకుంటారు. ఇంటికి వెళ్ళండి" అన్నది.

సింగ్ బంగళా, కనులకు విందుగొలిపే అందాల సోఫాలన్నట్లే ఆకర్షించలేకపోయింది. పూరిగుడిసెలోవున్న రంగమ్మ ఎవరై వుంటుందీ. దగ్గరగా వున్న కుర్రవాడు ఏమవుతాడూ, అనే సంగతులు పదేపదే నా హృదయంలో పరిణతిని పొందాయి.

రాత్రి భోజనం చేయడం, నా పుస్తకాల చదువు గొడవలో—సద్యోఫలితమైన విద్యుద్దీపం—పక్షి రెక్కల్లా చల్లని గాలిఉయ్యాల లూపే ఎలక్ట్రిక్ పంకా, సౌఖ్యాన్ని చేకూర్చాయి. చదువుకుంటే నిదురకే శరీరం, మనస్సు కూడా దోహదం చేస్తాయి.

ఉదయం నేను లేచేసరికి చాలా ఆలస్యమైంది. నేను సాధారణంగా చీకటివుండగానే లేస్తాను. ఆరోజు మాత్రం ఆలస్యమైంది. లేచిన వెంటనే కాఫీ లేకపోతే దుర్దినంగా తోస్తుంది కాబట్టి వంట ఇంట్లోకి వెళ్ళేసరికి మా చెల్లెలు ఆప్యాయంగా ఫలహారం, కాఫీ అందించింది. ఫలహారం చేస్తూవుంటే—

"ఏమిరా, నిన్న సాయంత్రం సింగ్ ఇంటి నుంచి వస రంగమ్మను పలకరించావుగా అది నాతో వచ్చి చెప్పుకుంది. దాని గాథ విచిత్రమైంది—నాకు తెలుసు. అప్పుడప్పుడు మన ఇంట్లోకివచ్చి పని సహాయం చేస్తూ వుంటుంది" అని అంటూ—

"పెద్ద యింటికి చెందిందే పాపం—దాని ఖర్మం ఇలా కాలి అగచట్లు పడుతున్నది. మన ఊరికి దగ్గరవున్న గుంకలాం కరణం కూతురు. తండ్రికివల్లమాలిన ఆస్తీ, పలుకుబడీ—అన్నిటినీ విసర్జించి, వారింటికి చెందిన ఒక పాలికాపును ప్రేమించి తండ్రి దండిస్తే, అతనితో లేచిపోయి నెల్లిమర్ల మిల్లులో ఇద్దరూ పని చేస్తుకుంటూ, తెచ్చుకున్నది తక్కువేదైనా, సుఖంగా కాలక్షేపంచేసి, సౌఖ్యంగా జీవితాన్ని గడుపుతూ

వుండే రోజుల్లో రంగమ్మకు ఒక కుర్రవాడు పుట్టాడు. వాడే ఆ రంగమ్మ దగ్గర కూర్చున్నవాడు''

''వాడు వన్యమృగంకంటె అధ్వాన్నం పశుబాలుడు. వాడికి వినిపించదు. మాటలురావు. వ పు పుట్టిన రెండేళ్ళకి నెల్లిమర్లలో కలరా రావడం,—ఎవరికోసమైతే తాను త్యాగాన్నిచేసి జీవితం స్వర్గంగా చేసుకుందో, వాణ్ణే తన చేతులతో పిడికెడు బుగ్గి వేసి, నడిసముద్రంలో నావలా పిల్లణ్ణి పెంచలేక, కూలి చేయలేక— సొంతవూరు చేరుకొని, అపరాధం మన్నించమని తండ్రి కాళ్ళు పట్టుకుంది. బలవంతం మీద తండ్రి ఆ హీనుడికి పుట్టిన కొడుకును వదిలేసి తాను వచ్చి ఇంట్లో వుండొచ్చు అన్నాడు. తనకు మనస్కరించలేదు.

''అనాకారులైనా, కురూపులైనా బిడ్డలను వల్లమాలిన మమకారంతో సాకుతుంది. అందుకే స్త్రీ, పురుషుడికంటే ఎప్పుడూ గొప్పదే''

''ఊళ్ళు తిరిగి, ఈ గరివిడి చేరుకుని, గనిలో పనిచేస్తే, రక రకాల మనుషులు 'వుండడమే కాకుండా, పిల్లణ్ణి ఒంటరిగా విడవవలసి వస్తుంది కాబట్టి, సింగ్ ఇంటిదగ్గర అంట్లు తోముతుంది. ఒకపూట భోజనం, నెలకు మూడు రూపాయలు ఇస్తారు మానవతి, ఉత్తమ' గుణాలు కలిగింది. ఐతేనేం? దరిద్రం వున్నప్పుడు'జీవితం రేణికిరాదు.''

అని మా చెల్లెలు నాతో చెప్పేసరికల్లా నా మనస్సు వికలమైంది. రంగమ్మమీద ఒక విధమైన గౌరవం, రంగమ్మ కొడుకుమీద జాలీ కలిగాయి.

నేను పుస్తకాలకోసం అప్పుడప్పుడూ సింగ్ ఇంటికి వెళ్తున్నప్పుడు, రంగమ్మని పలకరించడం, కాస్త ఏదైనా చిల్లర డబ్బులు ఇవ్వడానికి ప్రయత్నిస్తే ఆమె ఎంతమాత్రం వద్దని, వారించి పుచ్చుకునేదికాదు. ఎప్పుడూ రోదిస్తూ వుండేటువంటి ఆ కొడుకు చేతులో కాస్త చిల్లర డబ్బులు పెట్టి ఇల్లు చేరుకునేవాణ్ణి.

* * *

ఒకనాడు ఉదయాన్నే ఏదో వ్యాసం రాస్తూ, కొన్ని పుస్తకాలు అవసరంవచ్చి సింగ్ ఇంటికి హుటాహుటీ బయలుదేరి వెళ్తున్నాను తోవలో రంగమ్మను పలకరించిపోదామని చింతచెట్టు దగ్గరికి చేరుకునేసరికి, ఆ చింతచెట్టుకు వేసి రంగమ్మ కొడుకుని ఒక తాడుతో కట్టబడిన దృశ్యం కనిపించింది విపరీతంగా ఏడుస్తున్నాడు రంగమ్మ కొడుకు. రంగమ్మని పిలిచి—

''ప్రకృతే వాడికి చేయవలసినంత అన్యాయం చేసింది ఇంకా ఈ తాడుతో కూడా ఎందుకు బంధిస్తావు వాణ్ణి? నీవు అన్నది వాడికి వినిపించదు. మాట్లాడేందుకు ఉపయుక్తంకాని నోరు ఏడుపుకే పనికొస్తుంది. వాడి భాషంతా ఏడుపే — వదిలిపెట్టు'' అన్నాను

రంగమ్మ గుడిసెలోనుంచి పైకి వచ్చి, కంటనీరు పెట్టుకుంటూ ''ఏం చేయమన్నారు బాబూ —వాడి బాధ పడలేకుండా ఉన్నాను. ఈమధ్య ఒకరోజు సింగు కొడుకు పుట్టినదినం వచ్చింది —ఆ సింగుకొడుక్కి మంచి ముఖమల్ ఎర్ర బుష్‌కోటు తొడిగారు. అది వీని కంట బడింది. అప్పణ్ణుంచీ అలాంటి కోటు కావాలని ప్రతినిత్యం ఏడుస్తూ పొద్దున్న తెల్లవారేముందు, సాయంత్రం సంధ్యలోనూ, ఆకాశం పక్క చూపిస్తూ, అరుస్తూ ఏడుస్తాడు. నాకాశక్తి ఎక్కడ ఉంది కొనేందుకు అలాంటి కోటు! నెలకు ఇచ్చే మూడు రూపాయల్ల జీతంలో ఒక రూపాయి మిగిల్చి, రెండు రూపాయలు ఖర్చు చేసుకుంటున్నాను. నా కెంత అభిమానం ఉంటే మాత్రం ఏం సాగుతుంది ? జీతంలోది కష్టపడి మిగుల్చుకున్న మూడు రూపాయలతోటి ఒక ఎర్ర కోటు తెచ్చా, కొని—అది అక్కర్లేదంటాడు.

''ఆ సింగు కొడుకు వేసుకున్న లాంటి కోటే ఇమ్మంటాడు. అలాంటిది ఇరవై రూపాయల తక్కువ కివ్వనన్నారు. మా బతుకేమిటి, నేనేమిటి? నాతల చేస్తుందా ? కొనగలిగితే మాత్రం లోకం సహిస్తుందా ? చిన్న పిల్లాడు వాడికి ఇవన్నీ ఏం తెలుస్తవి బాబూ ?

''ఇవాళ సింగ్‌కొడుకు పుట్టిన దినం. నా చేతులో నేనే ఆ కోటు సింగ్ కొడుక్కి తొడిగాను. మా బాబుగాడుచూసి, సింగ్ కొడుకుమీదకెళ్ళి జులూంచేస్తే, సింగ్ కోపానికి హద్దులులేవు. మా బాబుకి ప్రమాదమైనా రావచ్చు. నాకున్న ఈ నౌకరీఐనా పోవచ్చు. ఇప్పుడు మళ్ళా పనిలోకి సింగ్ ఇంటికి వెళ్ళాలి. అంచాత తాడేసి కట్టేస్తే మంచిదికదా అని కట్టేశాను. అందుకలా మారాం చేస్తున్నాడు'' అని చెప్పింది.

* * *

సింగ్ బంగళాగేటుకేసి ప్రవేశించే సరికల్లా సింగ్ భార్య చడీ చప్పుడూ లేకుండా నావైపు కొచ్చి సద్దుచేయకుండా, తనతో రమ్మనమంది. నేను విస్మయం చెందాను. ఆవిడ చెప్పినట్లుగానే ఆవిడవెంట, బంగళా వెనుక భాగానికి చప్పుడు చేయకుండా మెల్లగా నడుస్తూ వెళ్ళాను. ఆవిడ మెల్లగా, రహస్యం చెప్పినట్లుగా నాతో ఈవిధంగా చెప్పింది ఈ పొద్దున వేళ పదిదాటేలోపున వాళ్ళ బంగళాకు ఎప్పుడూ రావద్దు. వస్తే ప్రమాదం వుందని అంది. అంటే నాకు అర్థమవక—

''ఏమిటా ప్రమాదం ?'' అని అడిగాను.

''రాత్రిళ్లు తాగడంలో గడిపిన సింగ్ తెల్లవారు జామున కుర్చీలోనే కొంతసేపు నిద్రించి, ఎనిమిది గంటలన్నరయ్యేసరికల్లా, పడక గదిలోనుంచి పైకి వచ్చి హాలులో కూర్చుంటాడు అప్పుడు అతనికంట ఎవర్గూ పడకూడదు. అతని చెవిని ఏ శబ్దం పడకూడదు. అతనికంట ఎవరైనాపడ్డా, ఏదైనా దారుణమైన శబ్దం ఆయన చెవినపడ్డా, సహించలేక కోపంవస్తే ఎంతపనైనా చేస్తాడు.''

ఒకమాటు ఆయనకు కావలసిన ఫలహారాలన్నీ ఆవిడ అమర్చి, అతని కంటబడకుండా ఆవిడ వంటింట్లోకి చేరుకుందట. ఎందుకో ఆవిడకి సింగ్ పిలిచినట్లుగాతోస్తే హాలులోకి వెళ్ళబోయిందట. ఆవిణ్ణిచూసి సింగ్ తుపాకీ తీశాడట. ఆవిడ జడిసి పారిపోయిందట. అందుచేత ''పుస్తకాలు కావలిస్తే సాయంత్రం రావచ్చును. ఇప్పటికి సద్దు చేయకుండా పెరటితోవంటే ఇంటికిపొండి'' అంది. నేను బ్రతుకుజీవుడా అనుకుని, బయటపడి నిషాకు జీవితం అమ్ముకున్న మనుష్యుల్లో రాక్షసత్వానికి చెందిన వింత గుణాలేవో బ్రహ్మజెముళ్ళా పెరిగి, సన్నిహితులైనవాళ్ళని హింసించడం లోకంలో మనకు తరచూ ద్యోతకమవుతుంటుంది. దీనికి హృదయతత్వశాస్త్రం కూడా సరియైన జవాబు చెప్పలేదేమో!

నేను ఇల్లు చేరుకుని వ్యాసం రాసుకుంటున్నాను. కొంతసేపయాక, తుపాకీ పేలిన శబ్దం వినిపించింది గుండె గతుక్కుమంది. సింగ్ ఇంట్లో నుంచి ఆ ధ్వని వినిపించింది. నాకు కరచరణా లాడలేదు. వెళ్ళిచూదామా అనుకున్నాను. వెళ్ళడంవల్ల ఏం చిక్కులు వస్తాయో, నాకు కాకపోయినా, నా బావమరిదికి—అని భయం వేసింది. వ్యాసం రాయలేకపోయి ఆలోచిస్తూ కూర్చున్నాను. పన్నెండు గంటలయింది. భోజనానికి లేద్దామనుకున్నాను.

రంగమ్మ కొడుకుని సింగ్ తుపాకీతో కాల్చి చంపేశాడని, గనిలోకెళ్ళే కూలీ లనుకుంటున్నారు. నేను వుండలేకపోయాను. ఏ ఆపద సంభవించినా, సంసిద్ధతతో రంగమ్మ పూరిగుడిసె దగ్గరకు తొందరగా వెళ్ళాను.

రంగమ్మ గుడిసెముందు కొద్దిమంది మనుష్యులు మూగివున్నారు. ఆ మనుష్యులను తోసుకుని లోపలికి వెళ్ళాను. రక్తపు మడుగులో మృతించిన రంగమ్మ కొడుకున్నాడు. గుండు గుండెల్లోంచి దూసుకుపోయింది. రంగమ్మ ఇంట్లో లేదు. నే నాశ్చర్యపడ్డాను. అక్కడవున్న కూలీని ''ఏం జరిగింది ?'' అని అడిగాను.

రంగమ్మ కొడుకు సింగ్ ఇంట్లో, పెరట్లో ఆడుకుంటున్నకొడుకు మీదికి గెంతుకుంటూ వెళ్ళి ఆ కుర్రవాణ్ణి గోళ్ళతో రక్కి, పళ్ళతో కోటు చీల్చిపారేశాడట. సింగ్ కొడుకు పెద్దగా ఏడ్చాడట. సింగ్ కిటికీలోనుంచి చూసి, తుపాకీ తెచ్చి రంగమ్మ కొడుకుని కాల్చేశాడట. ఇంట్లో పనిచేస్తున్న రంగమ్మను పిలిచి, ఇరవై రూపాయలు ఇచ్చాట్ట. ఈ విషయం ఎవరితోనైనా అంటే రంగమ్మను కాల్చి చంపుతానన్నాట్ట.

ఇంతలో రంగమ్మ ఏడుస్తూ వచ్చింది. రంగమ్మ చేతుల్లో ముఖమల్ బుష్‌కోటు వుంది. కొడుక్కి ముఖమల్ బుష్‌కోటు తొడిగింది. కన్నీళ్ళలో మిలమిల కూడా ఏదో కొంత కనిపించింది. కొడుకు నెత్తుకుని ఊరిబయట స్మశానంపక్క నడిచిపోయింది. తరువాత మరి రంగమ్మ ఏమైందో, ఎవరికీ కనుపించలేదు.

కొంతమంది కొడుక్కోసం చనిపోయిందన్నారు. మరికొంతమంది పుట్టింటికివెళ్ళి శుభ్రంగా వుందన్నారు. ఈ రెండింట్లో ఏదైనా అవడానికి అవకాశం కద్దు. ★

ఒక ఆసామీ—భోజనానికి మంచివేళ ఏదో చెబుతారా?

ఘన వైద్యుడు-భాగ్యవంతునకు ఇష్టం వచ్చినప్పుడు; పేదవానికి సాదందొరికినప్పుడూను.

తటవర్తి ప్రసాదరావు (హైద్రాబాద్)